సాక్షి
నిజామాబాద్

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ఘనంగా ఈస్టర్
జిల్లాలోని క్రిస్టియన్‌లు ఆదివారం ఈస్టర్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రార్థనలు చేశారు.
- 9లో ▸



పల్లెల్లోనూ బెట్టింగ్‌లు!
నగరాలు, పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్‌లు స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని పల్లెల్లోనూ సాగుతున్నాయి.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /21.7

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.



ఇఫ్తార్	సహర్
సోమ: 6:36	మంగళ: 4:42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

24 గంటల నిబంధన వైన్స్‌షాప్‌లకు వర్తిస్తుందా?

ఖలీల్‌వాడి : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో 24 గంటలు దుకాణాలు తెరిచి ఉంచడంపై కొత్త జీవో జారీ చేసింది. షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988ను సవరణ చేసి ఈనెల 4న కార్మికశాఖ జీవోను విడుదల చేసింది. ఈ జీవోల ప్రకారం దుకాణాలు 24 గంటలు తెరిచి ఉంచడానికి ప్రభుత్వం ఏడాదికి రూ. 10వేల అదనపు ఫీజు నిర్ణయించింది. అయితే ఇలా అదనపు ఫీజు చెల్లిస్తూ దుకాణాలు నడుపుకునే విధానం ఉమ్మడి జిల్లాలో వైన్స్‌లకు, బార్‌లకు కూడా వర్తిస్తుందా లేదా అనే చర్చ ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగుతోంది. ఉమ్మడి నిజామాబాద్‌లో 150 వైన్స్‌లు, 30 వరకు బార్‌లు ఉన్నాయి. బార్‌లు, వైన్స్‌లు ఎక్సైజ్ పరిధిలోకి వస్తాయి. పోలీస్‌యాక్ట్ ప్రకారం వైన్స్‌లు నడపాల్సి ఉంటుంది. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లోకి వైన్స్‌లు, బార్‌లు రావు. వీటికి 24 గంటల పాటు అందుబాటులో ఉండవని అధికారుల ద్వారా తెలిసింది. ఈ విషయమై నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరగా వైన్స్‌లు, బార్‌లకు ఎలాంటి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేవన్నారు. ఎక్సైజ్ వేళల్లోనే కొనసాగుతాయని తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ(ఏ)లోకి మార్చాలి

నిజామాబాద్‌నాగారం: ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని ముదిరాజ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ముదిరాజ్ ఉద్యోగుల స్థాయి సమావేశం ముదిరాజ్ సంఘంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో ముదిరాజ్‌లు రాణించాలన్నారు. ఐక్యంగా ఉండి పోరాటాలు చేద్దామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గంగాకిషన్, జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రమేశ్, నరేశ్ సన్, సంజీవ్, బాల నర్సయ్య, అశోక్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్ల యువతీ యువకులకు ఎంపికలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలో రాష్ట్రస్థాయి పోటీలు ఉన్నాయన్నారు. వివరాలకు 9989 040776 నంబరును సంప్రదించాలన్నారు.

జీజీహెచ్‌కు 29 మంది వైద్యులు

నిజామాబాద్ సిటీ: తీవ్ర వైద్యుల కొరత ఎదుర్కొంటున్న నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కు త్వరలో 29 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు రానున్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఓ ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు వివిధ విభాగాలలో సేవలు అందించనున్నారని తెలిపారు. గతంలో నాణ్యమైన వైద్యం కోసం మహానగరాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కానీ ప్రస్తుతం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు రావడం వల్ల ప్రజలకు మంచి వైద్యం అందుతుందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ తీసుకురావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే 17 మెడికల్ కళాశాలలు ఉండగా, కొత్తగా మరో తొమ్మిది మెడికల్ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభించనుందని వివరించారు. వీటివల్ల ప్రజలకు వైద్యంతో పాటు, విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీనిద్వారా వైద్యంతో పాటు సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందుతుందని, ఇది కేవలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందన్నారు.

ఇందూరుకు కొత్త బస్టాండ్!



పాత కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలం

సీఎం కేసీఆర్ పరిశీలనలో ఫైల్
- నగరంలో 5.23 ఎకరాల్లో నిర్మాణానికి ప్రతిపాదన
- ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలం పరిశీలన
- త్వరలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రానికి త్వరలో కొత్త బస్టాండ్ మంజూరయ్యే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైల్ సీఎం కేసీఆర్ టేబుల్‌పై ఉంది. దీనికి సీఎం షేషీ నుంచి త్వరలో గ్రీన్‌సిగ్నల్ లభించే చాన్స్ ఉంది. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ బస్టాండ్ నిర్మాణం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు సమాచారం. గతేడాది నవంబర్‌లో హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో నగరాభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంకు జిల్లా ఎమ్మెల్యేలు కొత్త బస్టాండ్‌పై ప్రతిపాదనలు చేశారు. సెప్టెంబర్ 5న జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేలు కొత్త బస్టాండ్ కోసం ప్రతిపాదించాలని భావించినప్పటీ సాధ్యం కాలేదు. దీంతో సమీక్షలో సీఎం దృష్టికి మంత్రి, ఆర్టీసీ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యేలు తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ముందు ఉన్న ఆర్‌అండ్‌బీకి చెందిన ఐదు ఎకరాల 23 గుంటల భూమిలో కొత్త బస్టాండ్ నిర్మించాలని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించిన తర్వాత ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎంవోకు పంపించారు. సీఎం కేసీఆర్ త్వరలో కొత్త బస్టాండ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి.

మెడికల్ కాలేజీ కోసం..

నిజామాబాద్ ప్రస్తుత బస్టాండ్ స్థలాన్ని మెడికల్ కాలేజీకి కేటాయించాలని నిర్మాణ సమయంలోనే ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో అప్పటి నుంచి కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు ఉన్నాయి. వైద్యకళాశాల విస్తరణకు స్థలం కావాల్సి ఉండడంతో మెడికల్ కళాశాల కమిటీ బస్టాండ్ స్థలాన్ని గతంలోనే ప్రతిపాదన చేసింది. కొత్త కోర్సులు, ఆస్పత్రిని పెంచేందుకు స్థలం కావాల్సి ఉండగా.. బస్టాండ్ అడ్డుగా ఉండడంతో సాధ్యం కావడం లేదు. దీంతో బస్టాండ్ వేరేచోటుకు మార్చాలని గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బస్టాండ్ కోసం ఆర్‌అండ్‌బీ ఆఫీస్‌కు సంబంధించిన స్థలాన్ని ఆర్టీసీ అధికారులు సర్వే చేశారు. 5.23 ఎకరాల స్థలంలో బస్టాండ్ నిర్మాణానికి మ్యాపులను ఆర్టీసీ చీఫ్ ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. తర్వాత బస్టాండ్ నిర్మాణం అంశం మరుగున పడింది. అయితే ఆర్టీసీ చైర్మన్‌గా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కొత్త బస్టాండ్ అంశం తెరపైకి వచ్చింది. మంత్రి, ఎమ్మెల్యేలు ఆర్‌అండ్‌బీకి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అయితే బస్టాండ్ నిర్మాణానికి కావాల్సిన పొడవులో స్థలం ఉన్నప్పటికీ, వెడల్పు తక్కువగా ఉందని భావించి పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్టాండ్ నిర్మిస్తే పాత కలెక్టరేట్ ఏరియాలోని రోడ్డును 100 ఫీట్లకు విస్తరిస్తే బస్సులు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఇబ్బందులు ఉండవని ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనలు పూర్తి చేసుకొని సీఎం టేబుల్‌పైకి వెళ్లడంతో ఎప్పుడైనా గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

మోదీ శ్రీరామచంద్రుడైతే..
అదానీ ఉదంతంపై జేపీసీ వేయాలి

- ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు
- ప్రధానిపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

కమ్మర్‌పల్లి : ప్రధాని మోదీ నిజంగా శ్రీరామచంద్రుడైతే అదానీ ఉదంతంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశాన్ని అదానీకి దోచిపెడుతూ ఆ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూలదోస్తున్నారని ఫైర్ అయ్యారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల్లో ఉన్న పేదల డబ్బులతో అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టించి నష్టాల పాలు చేయించారని మండిపడ్డారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టిన అదానీపై ఈడీ, సీబీఐలతో విచారణ జరిపించే దమ్ము, ధైర్యం ప్రధానికి ఉందా అని ప్రశ్నించారు. దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రధాని అవినీతిపై మాట్లాడడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. తెలంగాణ మోడల్ పాలన కావాలని అన్ని రాష్ట్రాల్లో ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని, సీఎం కేసీఆర్ పరిపాలన కావాలని ఆయన నాయకత్వం వహించాలని యావత్ దేశం ఆహ్వానిస్తోందన్నారు.

పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను విధిగా నిర్వహించాలి

బీఆర్‌ఎస్ ఆదేశాల ప్రకారం శ్రేణులు విధిగా కార్యక్రమాలను నిర్వహించాలని శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. పార్టీ ఆత్మీ సమ్మేళనం కుటుంబ సమ్మేళనంగా ఉండాలని, మనసు విప్పి మాట్లాడుకోవాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. రాష్ట్ర జనాభాలో తమ పార్టీకి సగం జనాభా కంటే ఎక్కువగా కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు లేని నాయకుడు ముందుకు వెళ్లలేడు

కార్యకర్తలు లేని నాయకుడు రాజకీయాల్లో ముందుకు వెళ్లలేడని మంత్రి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం, బలగం కూడా అన్నారు. ఉద్యమ కాలం నుంచే పార్టీకి సైనికులైన కార్యకర్తలున్నారని తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మక్క ధరకు దిగుమతి దెబ్బ..

- పక్షం రోజుల్లో క్వింటాలుకు రూ. 300లు తగ్గిన ధర
- మార్కెట్ ఆరంభంలో రూ. 2,200ల వరకు పలికిన రేటు
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి జోరుగా దిగుమతి

మోర్తాడ్(బాల్కొండ): మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి మక్కలు మన రాష్ట్రానికి దిగుమతి అవుతుండడంతో ఇక్కడి మక్కలకు ధర తగ్గిపోతోంది. పదిహేను రోజుల వ్యవధిలో క్వింటాలు మక్కలకు రూ. 300ల ధర తగ్గిపోయింది. మక్కల కొనుగోళ్లు ఆరంభమైన సమయంలో క్వింటాలుకు రూ. 2,200ల వరకు రేటు లభించింది. మద్దతు ధర కంటే రూ. 250 ధర ఎక్కువగా లభించడంతో రైతులు సంతోషించారు. ఎర్రజొన్నలు, తెల్లజొన్నల సాగువల్ల ఆశించిన లాభాలు దక్కడం లేదని భావించిన రైతులు యాసంగి సీజన్‌లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. 2022 సీజన్‌లో మక్కలకు మంచి ధర లభించడంతో అదే ట్రెండ్ ఈ సీజనులోనూ కొనసాగుతుందని రైతులు ఆశించారు. మక్కలకు మొదట్లో ధర బాగానే పలికినా క్రయవిక్రయాలు ఊపందుకుంటున్న సమయంలో ధర ఒక్కసారిగా తగ్గిపోవడం రైతులకు మింగుడుపడకుండా చేస్తుంది. మార్కెట్‌లోనే మక్కలకు ఎక్కువ ధర ఉండడంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరలేదు. కానీ ఇప్పుడు ధర పడిపోతుండడంతో కొనుగోలు కేంద్రాలు ఉంటే బాగుండనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో మన ప్రాంతం నుంచి పొరుగు రాష్ట్రాలకు మక్కలు ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. మక్కల దిగుమతి లేకుంటే ధర మరింత పెరిగే అవకాశం ఉండేదని వ్యాపారులు చెబుతున్నారు. దిగుమతులు పెరగడంతో ధర తగ్గించాల్సి వస్తుందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మక్కలకు ధర తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాలెం రోడ్డు పక్కన ఆరబోసిన మక్కలు

వేగంగా విస్తరణ

- రూ. 40 కోట్లతో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర రోడ్డు పనులు
- బోధన్ నుంచి సాలూర వరకు 8.5 కిలోమీటర్ల మేర నిర్మాణం
- నాలుగు లైన్లుగా పనులు
- మూడు చోట్ల బైపాస్ రోడ్డు
- పర్యవేక్షిస్తున్న నేషనల్ హైవే అథారిటీ



సాలూరలో మంజీర నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం



పంట పొలాల్లో నుంచి బైపాస్ రోడ్డు పనులు

బోధన్: తెలంగాణకు సరిహద్దులోని సాలూరకు పొరుగున మహారాష్ట్రలోని నర్సి – జగదల్‌పూర్ 63వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్ నుంచి సాలూర వరకు 8.5 కిలోమీటర్ల పొడువున నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ అంతరాష్ట్ర రోడ్డు విస్తరణకు రూ. 40కోట్లు మంజూరు కాగా, ఐదు నెలల క్రితమే పనులు ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ శాఖ పనులను పర్యవేక్షిస్తోంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే తెలంగాణ – మహారాష్ట్రల మధ్య అంతరాష్ట్ర రవాణా మరింత సాఫీగా మారనుంది.

రూ.120కోట్లతో మంజీరపై హైలెవల్ వంతెన

సాలూరకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మంజీర నదిపై 10 మీటర్ల వెడల్పుతో 22 డబుల్ పిల్లర్లతో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు. మహారాష్ట్ర ప్రాంత జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు వంతెన నిర్మాణానికి రూపకల్పన చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ. 180 కోట్లు మంజూరు చేయగా, రూ. 120 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుంది. గతేడాది మే నెలలోనే పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తోంది. వంతెన పనులను పూర్తిగా మహారాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. మంజీర నదిపై ఉన్న పాత లోలెవల్, హైలెవల్ రెండు వంతెనల మధ్య ప్రస్తుతం కొత్తగా హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు.

మూడు చోట్ల బైపాస్ రోడ్డు

బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు చేపట్టిన 8.5 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో 4.5 కిలోమీటర్ల వరకు నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల వద్ద మూడుచోట్ల బైపాస్ రోడ్డు పనులు చేపట్టారు. పాత రోడ్డుకు కొనసాగింపుగా 10 మీటర్ల వెడల్పుతో పనులు కొనసాగుతున్నాయి. ఇందుకు రైతుల నుంచి సుమారు 30 ఎకరాల వరకు పట్టా భూములు సేకరించారు. సాలూర క్యాంప్, సాలూర శివారులోని సాగు భూముల్లో పంటలు ఉండడం వల్ల రెండు చోట్ల పనులు ఆగాయి. నాగన్‌పల్లి శివారులోని పసుపు వాగుపై హైలెవల్ వంతెన నిర్మించనున్నారు. పాత రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు, మొరంతో చదును చేసే పనులు నడుస్తున్నాయి. బైపాస్‌రోడ్డు మార్గంలో మొరంతో చదును చేస్తున్నారు. పలుచోట్ల కల్వర్టుల పనులు పూర్తి చేశారు.

ఏడాదిన్నరలో పూర్తిచేయాలి

బోధన్ నుంచి సాలూర వరకు చేపట్టిన అంతరాష్ట్ర రోడ్డు విస్తరణ, బైపాస్ రోడ్డు పనులు ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణకు రూ. 40 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

– కాంతారావు, ఈఈ నేషనల్ హైవే అథారిటీ

ఈతకొలనుపై 'ఆఫీసర్స్' కన్ను

- ప్రభుత్వాధీనంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్
- ఆఫీసర్స్ క్లబ్ కోసం ఇస్తున్నారని జోరుగా ప్రచారం
- ఆందోళనలో క్రీడాకారులు
- ఇటీవలే ఆర్డీవో, ఇతర అధికారుల పరిశీలన
- పట్టించుకోని 56 క్రీడా సంఘాలు

నిజామాబాద్‌నాగారం : జిల్లాలో క్రీడాకారులపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. క్రీడలకు సంబంధించిన స్థలాలపై కన్నేసి వారికి తీరని అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టరేట్ క్రీడా మైదానంపై ఉంటుందో.. పోతుందోనని క్రీడాకారులకు భయం పట్టుకుంది. తాజాగా జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్‌ను కూడా కబ్జా చేసేందుకు కుటిలయత్నాలు మొదలుపెట్టారు. నాలుగురోజుల క్రితం ఆర్డీవో, ఇతర అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించిన విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. పాత కలెక్టరేట్ వద్ద ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌ను కూల్చేసి ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ భవనాన్ని ఆఫీసర్స్ క్లబ్‌కు ఇచ్చేందుకు అనధికారికంగా సిద్ధమైనట్లు సమాచారం. అయితే ఆశ్చర్యకర విషయమేమిటంటే జిల్లాలో ఉన్న దాదాపు 56 క్రీడాసంఘాల ప్రతినిధులు ఈ విషయంపై స్పందించకపోవడంపై క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు.

ఖాళీ స్థలం..

జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఎందరో స్విమ్మింగ్ క్రీడాకారులకు సేవలందిస్తోంది. అలాగే ఈ ఆవరణలోనే స్కేటింగ్, జూడో, యోగా, కుస్తీ, తదితర క్రీడా పోటీలకు సంబంధించి ఎంపికలు కూడా నిర్వహిస్తుంటారు. సుమారు నాలుగైదు క్రీడలకు వేదికగా ఈ స్విమ్మింగ్ పూల్ ఆవరణ నిలుస్తోంది. ముఖ్యంగా వేసవి కాలంలో మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలతో పాటు ఇతర నెలల్లో కూడా క్రీడాకారులకు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. క్రీడాకారులకు కలెక్టరేట్ గ్రౌండ్ తర్వాత ముఖ్యమైన క్రీడావేదికగా స్విమ్మింగ్‌పూల్ నిలుస్తోంది. అయితే అధికారుల కన్ను స్విమ్మింగ్ పూల్ ఆవరణపై పడింది. ఆఫీసర్ క్లబ్‌లో ఉన్న వారి కోసం స్విమ్మింగ్‌పూల్ స్థలాన్ని కేటాయించడానికి అధికారులు తెరలేపారు.

నాలుగైదు క్రీడలకు శిక్షణ

ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణను ఆఫీసర్స్ క్లబ్ కోసం ఇచ్చేందుకు అధికారులు పరిశీలించడంతో క్రీడాకారులు అయోమయంలో పడ్డారు. చాలా మంది క్రీడాకారులు వయస్సుతో సంబంధం లేకుండా స్విమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకుంటున్నారు.



పిల్లలు జూడో, యోగా, స్విమ్మింగ్, కుస్తీ తదితర క్రీడలకు సంబంధించి శిక్షణ తీసుకుంటున్నారు. ఈ విషయమై క్రీడాసంఘాలు పట్టించుకోకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఇటు బాలికల హాస్టల్.. అటు రామాలయం

స్విమ్మింగ్ పూల్‌కు ఒక పక్కన పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించి బాలబాలికల వసతి గృహం ఉంది. మరోపక్క రామాలయం ఉంది. మరి ఇలాంటి ప్రాంతంలో ఆఫీసర్స్ క్లబ్ ఏర్పాటు చేసి అధికారులు ఎందుకు ఇబ్బందులు కల్పించాలని చూస్తున్నారని క్రీడాకారులు, ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలోని క్రీడాకారుల కోసం పెద్దగా క్రీడాస్థలాలు లేవు. నగరం నడిబొడ్డున ఉన్న కలెక్టరేట్ మైదానం ప్రాంతంలో కళాభారతి నిర్మించడానికి ఇప్పటికే శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. కలెక్టరేట్ మైదానంలో క్రీడాకారులు బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, ఉషు క్రీడల్లో క్రీడాకారులు ప్రతినిత్యం శిక్షణ తీసుకుంటున్నారు. నగర శివారులో ఉన్న రాజారాం స్టేడియం క్రీడాకారులకు చాలా దూరం కావడంతో అంతదూరం ఎవరూ వెళ్లట్లేదు.

పరిశీలించారు..

ఆఫీసర్స్ క్లబ్ కోసం ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలన చేశారు. ఆర్డీవో, తహసీల్దార్ వచ్చి చూశారు. ఇంకా ఏమీ చెప్పలేదు. క్రీడాకారులకు ఉన్న స్థలాన్ని తీసుకోవడం సరైన పద్ధతి కాదు.

– ముత్తెన్న, డీవైఎస్‌వో

క్లుప్తంగా

పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ చేపట్టాలి



బోధన్: టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని వైఎస్సార్ టీపీ బోధన్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నింబూరి సత్యవతి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పిలుపు మేరకు సేవ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేపర్ లీకేజీవల్ల 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరుద్యోగుల పక్షాన ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. తక్షణమే టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి ఖాళీగా ఉన్న లక్షా 91వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు జగన్, అశోక్, ప్రభాకర్, పోచయ్య, భార్గవి, అనిత, దేవిరాజమ్మ పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్‌గా బాలు



కామారెడ్డి అర్బన్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) సేవాదళ్ రాష్ట్ర చైర్మన్‌గా కామారెడ్డికి చెందిన డాక్టర్ బాలు నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆయనకు నియామక పత్రం అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా తనకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంపై బాలు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తహసీల్దార్‌కు యాదగిరి గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 164/3లో నర్సవ్వ పేరుపై ఉన్న రెండు ఎకరాల భూమిని పహాణీలో రౌండప్ చేసి దానిలో గతంలో వీఆర్‌వోగా పని చేసిన గంగారెడ్డి తన కుమారుడైన శ్రీనివాస్ రెడ్డిపై చేర్చారన్నారు. నర్సవ్వ, అమె భర్త ఇద్దరు మృతి చెందారు. వీరికి వారసులు లేనందున వారి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు సిబ్బందిని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో వేసిన పంటతోపాటు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డి: పట్టణంలోని పలు ఆలయాల్లో చోరీకి యత్నించిన దుండగుడికి దేహశుద్ధి చేసినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం ప్రధాన ద్వారం తాళాలను శనివారం అర్ధరాత్రి సమయంలో దుండగుడు ధ్వంసం చేసి, అనంతరం అయ్యప్ప ఆలయ ప్రధాన ద్వారం ధ్వంసం చేశాడు. దీంతో తాళాల శబ్దం విన్న స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు వారు తెలిపారు. ఈవిషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అన్నారు.

పల్లెల్లోనూ బెట్టింగ్‌ల జోరు!

- అంతా స్మార్ట్‌ఫోన్లలోనే..
- మోసపోతున్న యువత

రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లో తెలియకుండా రూ.ఒక లక్ష అప్పు చేసి, ఐపీఎల్‌లో బెట్టింగ్‌లు పెట్టి చేతులు కాల్చుకున్నాడు. కాగా వడ్డీకి తీసుకొచ్చిన డబ్బులు కట్టాలని సదరు యువడిపై ఒత్తిడి తీసుకరాగా, ఆ యువకుడి తండ్రి మిత్తితో సహా రూ.లక్షన్నర కట్టినట్లు తెలిసింది. ఇదే మండలంలోని ఓ తండాలో సైతం ఇలాంటి పరిస్థితి నెలకొంది. దీంతో నగరాలు, పట్టణాలే కాకుండా పల్లెలోనూ ఐపీఎల్ బెట్టింగ్ ఏ దశలో సాగుతుందో అర్థం చేసుకోచ్చు.

రామారెడ్డి(ఎల్లారెడ్డి): నగరాలు, పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్‌లు, ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ పుణ్యాన పల్లెల్లోనూ కొనసాగుతోంది. గతంలో బెట్టింగ్‌లు వేయాలంటే బుకీలంతా ఒక కేంద్రంగా స్థావరం ఎంచుకుని గుట్టుగా నిర్వహించేవారు. ఆ స్థావరం సమాచారం పోలీసులకు అందితే వారిని సులభంగా పట్టుకునేవారు. ప్రస్తుతం బెట్టింగ్ దందా మొత్తం స్మార్ట్‌ఫోన్ ఆధారంగా సాగుతోంది. కానీ ప్రస్తుతం ఫోన్‌లోనే బెట్టింగ్ కొనసాగడంతో చేతిలో ఫోన్, అకౌంటులో పైసలుంటే చాలు. పట్నం, గ్రామం, పల్లె, తండా అన్న తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ జోరుగా కొనసాగుతుంది.

బెట్టింగ్‌లు సాగేదిలా..

ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభంలో బుకీల ఫోన్లు ఆరంభమవుతాయి. ముందుగా వారు సూచించిన అకౌంట్లలో డబ్బులు జమ చేయాలి. తర్వాత పోటీ పడుతున్న రెండు జట్లు బలాబలాల ప్రకారం బెట్టింగ్ ఉంటుంది. బలమైన జట్టుతో, బలహీనమైన జట్టు పోటీలో ఉంటే బలహీనమైన జట్టుపై గెలుస్తున్నారని బెట్టింగ్ కాస్తే ఒకటికి రెండు, మూడు రెట్లు కూడా డబ్బులు చెల్లిస్తారు. మ్యాచ్ జరుగుతున్నంత సేపు బెట్టింగ్‌ను జట్లలో ఏ వైపుకైనా మార్చుకునే అవకాశం ఉంటుంది. బంతి బంతికి బెట్టింగ్‌తో పాటు, సిక్స్ కొడతాడా? ఫోర్ కొడతాడా? వికెట్ పడుతుందా? తదితర వాటిపై బెట్టింగ్ ఉంటుంది. ఈ తతంగమంతా స్మార్ట్‌ఫోన్లలోనే జరుగుతుండగా



యాప్‌ల ద్వారా డబ్బుల చెల్లింపులు జరుగుతాయి. గెలిచిన వారికి మాత్రం డబ్బులు సీక్రెట్‌గా ఇస్తుంటారు. బెట్టింగ్‌లో నిర్వాహకులు ప్రత్యేక కోడ్ భాషను ఉపయోగిస్తున్నారు. ఈ బెట్టింగ్‌ల్లో డబ్బుల కోసం, జల్సాల కోసం పలువురు విద్యార్థి దశలోనే పక్కదారి పడుతూ, తల్లిదండ్రులకు కన్నీటిని మిగిలిస్తున్నారు.

ప్రత్యేక యాప్ ద్వారానే..

బెట్టింగ్ నిర్వాహకులు ప్రత్యేక యాప్‌ను సృష్టించి, వ్యవస్థను ఏర్పాటు చేసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఫోన్ ద్వారా జరిగే బెట్టింగ్‌ను నిరోధించడం పోలీస్ వ్యవస్థకు సవాల్‌గా మారింది. స్థావరాలు నిఘా వ్యవస్థకు అంతు చిక్కడం లేదు. బెట్టింగ్‌లో బడా వ్యాపారుల కుమారులే కాకుండా కంపెనీల్లో పని చేసే వారు, విద్యార్థులు కూడా పాల్గొంటూ నష్టాల బాట పడుతున్నారు. ఇప్పటికైనా యువత తల్లిదండ్రులు మేల్కొని, తమ పిల్లలు బెట్టింగ్‌ల బారిన పడకుండా జాగ్రత్తపడాలి. అధికారులు సైతం తగిన నిఘా ఉంచి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రులు నిఘా పెట్టాలి..

ఆన్‌లైన్ రమ్మీ, క్రికెట్ బెట్టింగ్‌ను యువత, విద్యార్థులు ఫోన్ల ద్వారా ఆడుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి. ప్రతి గ్రామంలో వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఎవరైన ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

–సురేష్, డీఎస్పీ, కామారెడ్డి

మార్పు రావాలి..

తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో అవసరం లేని వాటిని సైతం కొనిస్తున్నారు. ఆన్‌లైన్ తరగతులు ఉన్నప్పుడు ఫోన్లు అవసరం ఉండేది. ఇప్పుడు విద్యార్థులకు ఫోన్లు అవసరం లేదు. పిల్లలు నిత్యం చేసే ఆక్టివిటీస్ మీద తల్లిదండ్రులు నిఘా పెట్టాలి.

–బాలరాజు, హెచ్‌ఎం, రామారెడ్డి బాలికల పాఠశాల

సోషల్ సైన్స్ పరిశోధకులకు ప్రత్యేక శిక్షణ

- తెయూలో నేటి నుంచి ప్రారంభం
- 8రాష్ట్రాల నుంచి హాజరు కానున్న పరిశోధకులు

తెయూ(డిచ్‌పల్లి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్‌ఎస్‌ఆర్)సౌథర్న్ రీజనల్ సెంటర్–హైదరాబాద్, తెలంగాణ యూనివర్సిటీ సంయుక్త భాగస్వామ్యంలో నేటినుంచి సోషల్ సైన్స్ పరిశోధకులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తెయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో సోమవారం నుంచి వారం రోజుల పాటు 'ఆన్‌సైట్ రీసర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్/యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తారని కోఆర్డినేటర్ పున్నయ్య ఆదివారం తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన సోషల్ సైన్స్ పరిశోధకులు, వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో బోధించే యువ ఫ్యాకల్టీ ఈ శిక్షణ తరగతులకు హాజరవుతారని ఆయన తెలిపారు. శిక్షణలో భాగంగా వారం రోజుల పాటు 28 సెషన్లు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీల నుంచి అనుభవం కలిగిన ఆచార్యులు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. పరిశోధనలోని మెళకువలతో పాటు పరిశోధన పద్ధతులపై లోతైన అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ పరిశోధన ఫలాలు వెనకబడిన, అభివృద్ధి చెందుతున్న రంగాలను ముందుకు తీసుకుపోవడానికి ఉపయోగపడతాయన్నారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, గౌరవ అతిథిగా ఐసీఎస్‌ఎస్‌ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. సోషల్ సైన్స్ పరిశోధకులు, యంగ్ ఫ్యాకల్టీ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జానకంపేట దర్గా వద్ద ట్రాఫిక్‌జామ్



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామ సమీపంలోని బోధన్, నిజామాబాద్ రోడ్డు పక్కన గల దర్గా వద్ద ఆదివారం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దర్గా వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల్లో ఓ వాహనం మొరాయించడంతో ఆ వాహనం అక్కడే నిలిచిపోయింది. దీంతో మరో వాహనం ముందుకు వెళ్లలేక వెనకకు రాలేకపోవడంతో రెండు వైపులా భారీగా వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎడపల్లి ఎస్సై పాండేరావు తన సిబ్బందితో వచ్చి మొరాయించిన వాహనంను తొలగించి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత చెందారు. రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా.. ఒకరు ప్రమాదవశాత్తు మంజీరా నదిలో పడి మృతిచెందారు. ..

బైక్–కారు ఢీకొన్న ఘటనలో..



హన్మంత్ మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల వద్ద పెద్ద వాగు రోడ్డుపై బైక్‌ను, కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ముప్కాల్ ఏఎస్సై చిన్న గంగారాం తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని నాగంపేట్ గ్రామానికి చెందిన దండుగుల హన్మంత్(53) ఆదివారం బైక్‌పై రెంజర్ల నుంచి నాగంపేట్ వైపు వస్తుండగా.. ముప్కాల్ నుంచి రెంజర్ల వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో హన్మంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కారు స్వాధీనం చేసుకున్నామని, నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కామారెడ్డిలో మరొకరు..



ఖాసీం మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలోని జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉండే షేక్ ఖాసీం (58) ఆదివారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై జాతీయ రహదారిపై వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన కారు అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గతంలో చనిపోగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీరా నదీలో చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన గంగరబోయిన సాయిలు(62) ఆదివారం సమీపంలోని మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెళ్లి, పోలీసులకు తెలిపారు. ఏఎస్సై ఉమేష్ ఘటన స్థలానికి చేరుకొని సాయిలు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేలిన గ్యాస్ సిలిండర్



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: మండలంలోని అంకాపూర్ గ్రామంలో రాజుబాయి అనే నిరుపేద మహిళ ఇంట్లో ఆదివారం గ్యాస్ సిలెండర్ పేలి, స్వల్ప ఆస్తినష్టం సంభవించింది. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో సిలెండర్ పేలడంతో ఇంటిపైకప్పుకు స్వల్పంగా నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. బాధిత కుటుంబానికి ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు మట్ట కర్రన్న , సురేష్, భూమేష్, మోహన్, అమృతరావు, వాజీత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని మంజీరా నది నుంచి అర్ధరాత్రుళ్లు ఇసుకను తరలిస్తున్న బొలెరో వాహనాలను పట్టుకున్నట్లు ఏఎస్సై సీతారమనమ్మ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి మూడు వాహనాలు ఇసుకను నింపుకుని అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారం అందడంతో, గస్తీ కాచి వాహనాలను పట్టుకున్నారు. వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని కోర్టుకు అప్పగిస్తామన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



బూస నర్సింలు(ఫైల్)

రాజంపేట: మండల కేంద్రంలో ఆదివారం ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బూస నర్సింలు(30)కు ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్య రమ్యతో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఇటీవల భార్య తన పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈక్రమంలో నర్సింలు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆటో చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలో బాలాగౌడ్‌కు చెందిన బజాజ్ ఆటో చోరీకి గురైనట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. బాధితుడు తన (టీఎస్17టీ8822) ఆటోను శనివారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి ఆటో చోరీకి గురైనట్లు గుర్తించారు. రాత్రివేళ గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో బాధితుడు లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

ఆదర్శం.. ఆర్మీ రాజేశ్వర్




రాజేశ్వర్ ఏర్పాటు చేయించిన వ్యాయామ పరికరాలు.. యువతకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

- సొంత ఖర్చుతో ఆర్మీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ
- హుస్సేన్‌నగర్ గ్రామంలో వ్యాయామ పరికరాల ఏర్పాటు

సిరికొండ: దేశ రక్షణలో భాగమై పదవీ విరమణ అనంతరం ఆర్మీ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న వారికి ఉచితంగా శిక్షణ ఇస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు.. మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన పోతుగంటి రాజేశ్వర్. పదిహేడు సంవత్సరాల పాటు దేశ రక్షణలో సేవలందించి నాలుగేళ్ల క్రితం వీఆర్‌ఎస్ తీసుకున్నాడు. ఇండియన్ ఆర్మీలో హవాల్దార్‌గా విధులు నిర్వహించాడు. విధుల్లో ఉండగానే తనలాగే తన గ్రామానికి చెందిన యువకులు దేశ రక్షణలో పాలుపంచుకోవాలనే సంకల్పంతో వ్యాయామ శిక్షణ కోసం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సొంత ఖర్చుతో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయించాడు. వాటిపై ఏ విధంగా వ్యాయామం చేయాలో సెలవుల్లో వచ్చిన ప్రతిసారి గ్రామానికి చెందిన యువకులకు శిక్షణ ఇచ్చేవాడు. అలాగే ఆర్మీకి ఎంపికయ్యే విధానంపై యువకులకు సూచనలు అందించేవాడు.

మరింత మంది ఎంపికయ్యేలా..

2019లో రామగుండంలో నిర్వహించిన ఆర్మీ ర్యాలీలో రాజేశ్వర్ 150 మందికి శిక్షణ ఇవ్వగా 98మంది ర్యాలీకి ఎంపికయ్యారు. వారిలో 37మంది అన్ని పరీక్షల్లో పాసై, ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2021లో సూర్యాపేటలో నిర్వహించిన ప్రీ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో 2700 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి రన్నింగ్, మెడికల్, రాత పరీక్ష నిర్వహించగా 250 మంది ఎంపికయ్యారు. ఈ 250 మందికి అగ్నిపథ్ శిక్షణ కోసం విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పించారు. వీరికి రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ ఇచ్చారు. 2022 అక్టోబర్‌లో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో రాజేశ్వర్ వద్ద శిక్షణ పొందిన వారిలో 43మంది ఆర్మీలో అగ్నివీర్‌కు ఎంపికయ్యారు.

సామాజిక సేవల్లోనూ..

రాజేశ్వర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం పాలుపంచుకుంటున్నాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేయించడానికి రూ.7వేలు అందించాడు. లొంకతండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల కోసం రూ.5వేలను విరాళంగా అందించారు.

ఆసక్తి గల యువకులు సంప్రదించాలి..



చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరి దేశసేవలో భాగం కావాలని ఉండేది. అనుకున్నట్లుగానే తర్ఫీదు పొంది ఆర్మీకి ఎంపికయ్యాను. చిన్న తమ్ముడిని కూడా ఆర్మీకి ఎంపికయ్యేలా ప్రోత్సహించాను. ఆర్మీకి ఎంపికయ్యాడు. ఆర్మీకి మరింత మంది ఎంపికయ్యేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. ఆసక్తి ఉన్న యువకులు నా సెల్ నం 9701200879ను సంప్రదిస్తే తగిన శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతాను.

– పోతుగంటి రాజేశ్వర్, ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి

అన్ని వర్గాలకు సమాన గౌరవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- డిచ్‌పల్లిలో యాదవ మహాసభ సమావేశం

డిచ్‌పల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని కులాలు, మతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నూతన కార్యవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు గొల్ల, కుర్మల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషితో గొల్ల, కుర్మలకు గొర్రెలు, మేకలను 70శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు చేరుతున్నాయని, ప్రతి కుటుంబం ఏదో ఒక లబ్ధి పొందుతుందని తెలిపారు. యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలోని యాదవులు ఐక్యతగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏ నియోజకవర్గంలోనైనా పోటీ చేసి గెలువగలిగే సత్తా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు మాత్రమే ఉందన్నారు.రూరల్ నియోజకవర్గంలో యాదవ సంఘం భవన నిర్మాణం కోసం 2ఎకరాల ప్రభుత్వ స్థలం, రూ.50లక్షలు మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఎమ్మెల్యేకు విన్నవించారు. యాదవ మహాసభ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు రమేశ్ యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, కన్వీనర్ బాబురావు యాదవ్, ఉపాధ్యక్షులు గుడాల లింగం, జనార్ధన్ ఉన్నారు.

తత్కాల్ నకిలీ టికెట్లతో బురిడీ



బోగస్ పీఎన్‌ఆర్ నంబర్‌తో అందజేసిన రైలు టికెట్

కామారెడ్డి అర్బన్: తత్కాల్ కింద రైలు టికెట్లు బుక్ చేస్తానని నమ్మించి బోగస్ టికెట్లు అందించి మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా అశోక్‌నగర్‌కు చెందిన రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపూర్ జిల్లా హిందూపూర్‌కు చెందిన ఎనిమిది మంది స్నేహితులు ఈనెల 4న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేటలో నిర్వహించిన శుభకార్యంలో పాల్గొన్నారు. తిరిగి ఈనెల 7న స్వగ్రామానికి వెళ్లడానికి టికెట్ల కోసం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వారికి స్టేషన్‌లో ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. మొబైల్ ద్వారా రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేస్తానని నమ్మించాడు. దీంతోవారు కామారెడ్డి నుంచి గుంతకల్ వరకు 8 టికెట్ల కోసం రూ. 3,500 చెల్లించారు. ఆ అగంతుకుడు వారి మొబైల్‌కు టికెట్లను షేర్ చేశాడు. అనంతరం ఎనిమిది మంది రాయలసీయ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. సికింద్రాబాద్‌లో టీసీ చెక్ చేయగా.. అవి నకిలీవని తేలింది. దీంతో రైలు నుంచి దింపేశారు. ఈ విషయాన్ని వారు కామారెడ్డిలో నివసించే తనకు తెలిపారని, తన స్నేహితులకు నకిలీ టికెట్లు అంటగట్టిన వ్యక్తిపై ఆదివారం కామారెడ్డి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశానని రాజు తెలిపాడు.

రసవత్తరంగా కుస్తీపోటీలు



మల్లూర్‌లో కుస్తీపోటీల్లో విజేతకు నగదును అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ మండలంలోని మల్లూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మల్లయోధుల కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. చుట్టుపక్క మండలాల నుంచి వచ్చిన మల్లయోధులు తరలివచ్చి పోటీల్లో తలపడ్డారు. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటు ఆనందోత్సాహాలతో గడిపారు. 33 సంవత్సరాల తర్వాత ఇలా ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.